క్లుప్తంగా

ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి

పెదకాకాని: సంఘసంస్కర్త బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు బుధవారం పెదకాకాని గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు, సంగుల సంగీతరావు, బండ్లమూడి జయంతికుమార్, లింగంగుంట కిషోర్, పాటిబండ్ల మంత్రయ్య, బండ్లమూడి ప్రవీణ్, బంగారు రత్నబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసు దాడులు

పెదకాకాని: పేకటూరాయుళ్లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. ఇన్నర్‌రింగ్ రోడ్డు పక్కనే ఉన్న నివాసాల నడుమ పేకాటాడుతున్న ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకుని, వీరి నుంచి రూ.46,150 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

నిరుపయోగంగా అతిథి గృహం



పొన్నూరు : ప్రజల సొమ్ము రూ.లక్షలు వెచ్చించి పట్టణంలో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. భవనంతో పాటు ప్రాంగణం అధ్వానంగా మారినా స్థానిక అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. విశాలమైన ప్రదేశంలో అన్ని వసతులతో నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. సుమారు రూ.70 లక్షలతో జెడ్పీ స్థలంలో నిర్మించిన నూతన భవనానికి ఆదరణ కరువైంది. జిల్లా పరిషత్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో భవన ప్రాంగణం, పరిసరాలు అధ్వానంగా మారాయి. చెత్తతో నిండి ఉన్న అతిథి గృహానికి తలుపులు తీసే నాథుడు కూడా కరువయ్యాడు. గత ప్రభుత్వ హయాంలో కళకళలాడిన భవనం ప్రస్తుత ప్రభుత్వ ఆదరణ కోల్పోయి వెలవెలబోతుంది.

ఔషధ అభివృద్ధి, చికిత్సా ఫలితాలపై అవగాహన



గుంటూరు రూరల్: ఆధునిక ఔషధ శాస్త్రంలో, నూతన ఔషధాలను రూపొందించడమంటే కేవలం ప్రభావవంతమైన రసాయన పదార్థాన్ని కనుగొనటమే కాదని, అది శరీరంలో ఎలా పని చేస్తుందో, ఎంత సమర్థంగా లక్ష్య అవయవాన్ని చేరుకుంటుందో, ఎటువంటి ఫార్ములేషన్ వాడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో గుర్తించాలని క్లింఫార్మేడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మహేష్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఔషధ రూపకల్పన, చికిత్సా ఫలితాల మధ్య అంతరాన్ని తగ్గించడం, బయోఫార్మాస్యూటిక్స్, ఫార్మాకో కినెటిక్స్‌లో పురోగతులు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అతిథులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ అదాలత్

పొన్నూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం మండలంలోని దొప్పలపూడి గ్రామం అడ్డరోడ్డులోని గోవాడ చౌదరి ఫంక్షన్ హాలులో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించనున్నట్లు బాపట్ల ఈఈ జి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు.

20న పునర్విభజన దుష్ఫలితాలపై సమావేశం

గుంటూరు రూరల్: పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన దాని దుష్ఫలితాలపై ఈనెల 20వ తేదీన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీన ఆదివారం అమరావతి రోడ్డు నగరాలులోని బీవీఆర్ కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ మేధావి, రాజకీయ విశ్లేషకుడు జూకిసాన్ ఆందోళన నాయకుడు, భారత్ జోడో అభియాన్ వ్యవస్థాపకుడు యోగేంద్రయాదవ్ పాల్గొంటారని తెలిపారు.

ఎస్సీలకు రుణబంధనాలు

- ఎవరికి ఉపయోగపడని కార్పొరేషన్ లోన్లు
- జిల్లాలో 990 యూనిట్ల గాను 43 కోట్లు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు
- లోన్లు పెట్టుకునేందుకు విద్యార్హతలు తప్పనిసరి చేసిన వైనం



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నెహ్రూనగర్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోంది. యూనిట్ల విషయంలో అందుబాటులో లేకుండా పోయాయి. లోన్లు మంజూరు చేసి కేవలం తమ అనుకునే వారికి మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా లోన్లను ప్రభుత్వ పెద్దలను డిజైన్ చేశారంటూ పలువురు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

మూడు కేటగిర్లులలో యూనిట్లు..

కేటగిరి– 1 కింద ఫ్లవర్ బొటిక్ డెకరేషన్, వర్మీ కంపోస్ట్, వెబ్‌సైట్ డెవలప్‌మెట్, ఎల్ఈడీ బల్బ్, ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్ సర్వీస్, వాటర్ బాటిల్ రీపిల్ సర్వీస్, వాటర్ రీసైక్లింగ్.

కేటగిరి– 2 కింద మొబైల్ రీపేరింగ్, సోప్ తయారీ, ఫిష్ ఫార్మింగ్, టూరింగ్, మొబైల్ కార్ వాష్, బేకరి, బ్రిక్ ప్రొడక్షన్, సెరీ కల్చర్, ఆర్వో ప్లాంట్, వెల్డింగ్, జూట్ బ్యాగ్, సోలార్ ఎనర్జీ, కాయర్ ప్రొడక్ట్ తయారీ, ఫొటోగ్రాఫీ, వీడియోగ్రాఫీ, ఆయుర్వేదిక్ క్లినిక్, హెర్బల్ మెడిసిన్ స్టోర్, జనరిక్ మెడికల్ షాప్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్.

కేటగిరి– 3 కింద ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్.

ఎస్సీలకు తీవ్ర అన్యాయం

గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాల్లో ఫ్యాన్సీ స్టోర్, కిరాణా, ఇంటర్నెట్, టెంట్ హౌస్, లబ్ధిదారుడికి ఇష్టమైన యూనిట్ స్థాపించేందుకు అవకాశం ఉండేది. యూనిట్లు స్థాపనకు వయస్సు గతంలో 21 నుంచి 60 సంవత్సరాల వరకు ఉండేది. ప్రస్తుతం 50 సంవత్సరాలకే కుదించారు. ఏ యూనిట్ స్థాపించాలన్నా కూడా విద్యార్హతల సర్టిఫికేట్ అప్లోడ్ చేయాల్సిన పరిస్థితి. గతంలో రూ.25 లక్షల వరకు యూనిట్లు స్థాపించేందుకు అవకాశం కల్పించారు. కాని ఇప్పుడు తక్కువ మొత్తానికి పరిమితం చేశారు. గతంలో ఇన్నోవా కార్లు ఇచ్చేవారు.. ఈ సారి చిన్న కార్లకు పరిమితం చేశారు.

జిల్లాకు కేవలం 990 యూనిట్లు మాత్రమే

గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4వేల యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది. వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాని గుంటూరు జిల్లాకు రూ.990 యూనిట్లు, పల్నాడు జిల్లాకు రూ.992 యూనిట్లు మాత్రమే మంజూరు చేసి చేతులు దూలుపుకుంది. అందులో గుంటూరు జిల్లాకు సంబంధించి సబ్సిడీ రూ.16.33 కోట్లు కాగా, బ్యాంక్ లోన్ రూ.22.93 కోట్లు, లబ్ధిదారుని వాటా కింద రూ.2.66 కోట్లతో కలిసి మొత్తం జిల్లాకు 41.33కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 38.56 కోట్లు మాత్రమే మంజూరు అయ్యాయి.

సబ్సిడీ లోన్లు పేరుతో మోసం



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలు దళితుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తుంది. పేరుకే రుణాలు మంజూరు ప్రకటనలు చేసి ప్రగాల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలలో దళితులకు ఉపయోగపడే ఒక్క పథకం లేదు. గతంలో ఫ్యాన్సీ స్టోర్, కిరాణా, ఇంటర్నెట్, ఇతర యూనిట్లు స్థాపించేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం దళితులు ఎవరూ పెట్టలేని యూనిట్లు ఏర్పాటు చేసి దళితులను మోసం చేస్తున్నారు.

– గోళ్ల అరుణ్‌కుమార్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

దళితులు ఏం పాపం చేశారని



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 27 అంశాలు ఉపయోగపడే విధంగా లేవు. మాదిగలకు లెదర్ యూనిట్లుకు సంబంధించి లేకపోవడం దారుణం. 2018లో చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ.2173 కోట్లుగా ఉంటే 2019లో రూ.2450 కోట్లకు పెంచారు. కాని ప్రస్తుతం కేవలం రూ.340కోట్లు మాత్రమే మంజూరు చేసి దళితులను తీవ్ర అన్యాయం చేశారు. వయోపరిమితిని తగ్గించడం అన్యాయం.

– పరిశపోగు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు



అంబటిని సన్మానిస్తున్న బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు



అంబటిని సత్కరిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉత్తేజ్‌రెడ్డి



ఉత్తేజ్‌రెడ్డిని సత్కరిస్తున్న నూరిఫాతిమా

మర్యాదపూర్వక కలయిక

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును బుధవారం పార్టీ అనుబంధ విభాగాల నూతన అధ్యక్షుడిగా నియమితులైన పలువురు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాలరావు అంబటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా..

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాను బుధవారం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. నూరిఫాతిమాను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో పలువురు సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రముని



వేజండ్లలో విద్యార్థి ప్రవేశ దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంఈఓ సుబ్బారావు

వేజండ్ల(చేబ్రోలు): చిన్నారులను, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రముని అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో బుధవారం ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల ప్రవేశం కొరకు ర్యాలీ నిర్వహించారు. వేజండ్లలో జరిగిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రముని, ఎంఈఓ రాయల సుబ్బారావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నదని తెలిపారు. ఐదుగురు విద్యార్థులు నూతనంగా ప్రవేశ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం టి.విజయశ్రీ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసమూర్తి, లక్ష్మీ పద్మావతి, పి.దీప్తి, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్: తక్కెళపాడు వద్ద ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను వైద్య విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఎంఎన్‌సీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ప్రాక్టికల్ వైద్య విద్య ఇవ్వాలన్న ఉద్దేశంతో గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి ఆదేశాల మేరకు గుంటూరు మునిసిపల్ కమిషనర్ సహకారంతో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు పరిశీలించారు. నాలుగేళ్ల విరామం తరువాత ప్రిన్సిపాల్ ప్రత్యేక ఆలోచనతో ఈ ఫీల్డ్ విజిట్ ఏర్పాటు చేశారు. డాక్టర్ సుందరాచారి విజ్ఞప్తి మేరకు పూర్వ వైద్య విద్యార్థులు 1999 బ్యాచ్‌కు చెందిన పలువురు వైద్యులు రెండు కొత్త బస్సులు కాలేజీకి విరాళంగా అందించారు. నూతన బస్సులు అందుబాటులో ఉండటంతో ఫీల్డ్ విజిట్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య విద్యార్థులు వెళ్లారు. వాటర్ సెడిమెంటేషన్, రాపిడ్ సాండ్ ఫిల్టర్, క్లోరినేషన్ వంటి ప్రక్రియలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారు. వాటర్ ప్లాంట్ సిబ్బంది వాటిని చూపించగా, విద్యార్థులు ఆసక్తిగా గమనిస్తూ నోట్స్ తయారు చేసుకున్నారు. వాటర్ ప్లాంట్ సందర్శన విద్యార్థులకు పాఠశాల పుస్తకాల కతీతంగా ప్రాక్టికల్ అవగాహన కల్పించింది.

మే 20న జాతీయ కార్మిక సంఘాల సమ్మె

లక్ష్మీపురం: లేబర్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ మే 20వ తేదీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం బి.లక్ష్మణరావు అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకు లేబర్ కోడ్లను మారుస్తూ కేంద్రం కార్పొరేట్ సేవలో ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి కార్మికుడి వద్దకు మే 20వ తేదీ సార్వత్రిక డిమాండ్లను తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, వి.దుర్గారావు, కె.బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, జిల్లా కార్యదర్శులు వై.నేతాజీ, వై.రమణ, ఎస్ఎస్ చెంగయ్య, సిహెచ్. నాగ బ్రహ్మచారి పాల్గొన్నారు.

పీవీఎన్ కృష్ణకు మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారం



కృష్ణకు మల్లాది స్మారక పురస్కారం అందిస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం తెలుగు నాటక రంగ దినోత్సవం, మల్లాది చంద్రశేఖరశాస్త్రి శత జయంతి నిర్వహించారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్(హైదరాబాద్), శ్రీరామకృష్ణా నాట్య మండలి సంయుక్తంగా నిర్వహించగా, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ అధ్యక్షత వహించారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణకు మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు మల్లాది రాఘవరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, డాక్టర్ చింతలపాటి శూలపాణి, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. సభానంతరం ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించింది.

వెంగళాయపాలేన్ని సందర్శించిన ఆర్‌జీఎస్ సెంట్రల్ టీం



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళయపాలెం పంచాయతీని బుధవారం ఆర్‌జీఎస్ఏ సెంట్రల్ టీమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయంలో ప్రజలకు అందే సేవలు గురించి తెలుసుకున్నారు. గ్రామంలోని చెత్తనుంచి ఎరువుల తయారీ కేంద్రంను సందర్శించి, వాన పాముల ఎరువును ఎలా తయారు చేస్తున్నారు, ఏలా విక్రయాలు చేస్తున్నారు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా డీపీఆర్సీ ఏఓ ప్రతాప్, కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వి.రవి, సర్పంచి లలితకుమారి పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో పోషణ్ పక్షోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్షోత్సవాలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీ రత్నం, కార్యకర్తలు వై.సుష్మ, కె.అనిల్‌కుమారి, వై.భాగ్యలత, ఎం.అంకమ్మ, కె.రేఖ పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం సమావేశం

గుంటూరు రూరల్: నగరంలోని తాలూకా కాంపౌండ్‌లోగల పెన్షనర్స్ హాలులో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల రామదాసు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, డిమాండ్‌లను చర్చించామన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం!

పట్నంబజారు: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేటకు చెందిన వైద్యుడు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అసిస్టెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఆరిమండ తేజ కృష్ణకమల్ అనేవ్యక్తి పరిచయమయ్యాడు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఎవరైనా ఉంటే కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. సదరు డాక్టర్ పలువురి వద్ద నుంచి రూ.13 లక్షలు కట్టించాడు. మోసపోయామని గ్రహించిన డాక్టర్ భార్య ఎస్.శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన పి.నాగరాజు(28), మురళితో వివాదం జరిగింది. అయితే ఈనెల 15న రాత్రి అందరూ కలిసి మద్యం తాగిన క్రమంలో మురళి తనను ఏమీ చేయలేక పోయావంటూ నాగరాజును హేళన చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు మంగళవారం రాత్రి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- కాకుమాను మండల ముఖ్యనేతల సమావేశం



సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కాకుమాను మండల స్థాయి నేతల సమావేశం నిర్వహించారు. బలసాని మాట్లాడుతూ ప్రతి నాయకుడు కార్యకర్త కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండు సంవత్సరాలు కోవిడ్ ఇబ్బందులు ఉన్నా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు ఇంటివద్దకు చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.

సోషల్‌మీడియా జిల్లా అధ్యక్షుడిని అభినందించిన బలసాని

కూటమి ప్రభుత్వ కుట్రలను, సంక్షేమాన్ని విస్మరించి ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తున్న వైనాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఇటీవల నూతనంగా గుంటూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులుగా నియమితులైన కొరటిపాటి ప్రేమ్‌కుమార్, ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో బలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బలసాని, ప్రేమ్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెదకాకాని: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతను సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో చెరువులకు నీరు నింపాలని కోరారు. తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. అలానే 99 పనులు గుర్తించి వాటికి 55,74,500 రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. డంపింగ్ యార్డుల వద్ద పనులు ప్రారంభించడం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, వన్‌టైమ్ యూజ్డ్ ప్లాస్టిక్, ఈకేవైసీ, మనమిత్ర యాప్ వంటి అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. అలానే విద్యాశాఖలో వినూత్న మార్పులు, తల్లికి వందనంపై ఎంఈఓ శంకరరాజు వివరించారు. మండలంలో కుక్కల సమస్య, పందుల సమస్య, కోతుల సమస్య, ఇళ్ల పట్టాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి అంశాలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, గుజ్జుల సుమతి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆపదలో సమయ స్ఫూర్తి అవసరం



ప్రదర్శన చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

పొన్నూరు: ఆపద సమయంలో ఆందోళన చెందకుండా, సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాలను నివారించవచ్చని పొన్నూరు అగ్నిమాపక అధికారి కె. ప్రసాదరావు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం డీవీసీ కాలనీ, మున్సిపల్ కార్యాలయం రోడ్డులోని పలు అపార్ట్ మెంట్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అపార్ట్ మెంట్లు, గృహాల వద్ద వంట గ్యాస్ వినియోగంలో ప్రమాదవశాత్తు సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు నిర్వహించిన అవగాహన ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి. గ్యాస్ సిలెండర్ వద్ద చెలరేగే మంటలను ఆర్పే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పలు సూచనలతో ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు తెలియజేసేందుకు అగ్ని మాపక సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు.

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని అపార్ట్‌మెంట్స్, కమ్యూనిటీ గృహ సముదాయాల వారు తమ ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వేయరాదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టాభిపురం, రవీంద్ర నగర్, శ్యామలా నగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శ్యామల నగర్ 3వ లైన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్ మెన్ వ్యర్థాలను పక్కన ఖాళీ స్థలంలో వేయడం గమనించారు.. అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ వ్యర్థాలను పక్కన ఉండే ఖాళీ స్థలాల్లో వేయడం వలన చుట్టుపక్కల ఉండే నివాసితులకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో తగిన డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, కంపోస్ట్ ఎరువు తయారీకి ముందుకు రావాలని కోరారు. కంపోస్ట్ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ తగిన అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజారోగ్య కార్మికులు కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో సేకరించిన చెత్త వేయకుండా ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా అదనపు కార్మికులతో పాటు వాహనాలు ఇస్తున్నామని, వాటి ద్వారా చెత్త కుప్పలను డంపింగ్ యార్డుకి తరలించాలని వివరించారు. కృష్ణ నగర్ పార్కుని పరిశీలించి, పార్కులో వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్‌ని సదరు కాంట్రాక్టర్‌తో రీపేర్ చేయించాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం ఒమేగా హాస్పిటల్స్, ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీలు ముందస్తు పన్ను చెల్లిస్తూ కమిషనర్‌కు చెక్కులను అందించారు. ఒమేగా హాస్పిటల్స్ రూ.15,12,784, ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ రూ.16 లక్షల ముందస్తు పన్ను చెల్లింపు చెక్కులను అందించారన్నారు.

ద్విచక్ర వాహనం దహనం

పట్నంబజారు: ద్విచక్రవాహనం తగలబెట్టిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రామిరెడ్డితోటకు చెందిన ఆర్.జస్విక్టర్ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి తగులబెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.